# నిశ్చింతగా పెట్టుబడి పెట్టాలంటే...

పి. జయప్రకాష్

**గొప్ప వ్యాపారంపై పెట్టుబడి పెట్టినప్పుడు, స్టాక్ మార్కెట్ పదేళ్లపాటు మూతపడినా బాధపడనక్కర్లేదు —వారెన్ బఫెట్**

ఒక గొప్ప పెట్టుబడి సూత్రం ఇందులో ఇమిడి ఉంది. స్టాక్ మార్కెట్ పెట్టుబడుల్లో ఆరు దశాబ్దాల అనుభవం ఉన్న వారెన్ బఫెట్ తన విజయాలకు ప్రధానంగా మూడు సూత్రాలను ప్రస్తావిస్తారు. అవి చక్రీయ ప్రతిఫలం (కాంపౌండింగ్), ఈక్విటీ పెట్టుబడుల సామర్థ్యం, విలువను గుర్తించి పెట్టుబడి పెట్టడం (వేల్యూ ఇన్వెస్టింగ్).



ఆయన ఇంకా ఏం చెబుతారంటే...

'నేను ఎప్పుడైనా షేర్లు కొనాలని లేదా విక్రయించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు మాత్రమే మార్కెట్ కేసి చూస్తాను. లేనిపక్షంలో రోజూ మార్కెట్ కేసి చూడటం, దానికి స్పందించడంలో అర్థం లేదు' అంటారాయన. అంటే మార్కెట్లో ఎక్కువగా తలదూర్చకపోవడం ద్వారానే ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చు- అంటారాయన. ఆయన చెప్పేది ఒక్కటే... తక్కువ చేసి, ఎక్కువ సంపాదించమంటాడు. ఇది సాధ్యమవుతుందా? అన్న అనుమానం అక్కర్లేదు. మంచి కంపెనీలను గుర్తించి సరైన సమయంలో వాటి షేర్లను కొంటే చాలు... వరస విజయాలను ఆస్వాదిస్తూ ఉండవచ్చు.

### మంచి కంపెనీలను గుర్తించడమెలా?

ఎంతో తేలిక. ఈ కింది నాలుగు లక్షణాలు ఉంటే అది ఒక మంచి కంపెనీ అనే నిర్ధారణకు రావచ్చు.

- ఒక కంపెనీ చేసేది సరళమైన వ్యాపారమై ఉండాలి.
- అది బహుముఖంగా విస్తరించే అవకాశం ఉండాలి.
- సదరు కంపెనీ స్థిరమైన వృద్ధి సాధిస్తూ ఉండాలి.
- అత్యున్నత వార్షిక పనితీరును కనబరుస్తూ ఉండాలి.

మదుపర్ల అవగాహన కోసం అలాంటి ఆరు కంపెనీల వివరాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. అవి చమురు-సహజ వాయువు, సాఫ్ట్‌వేర్, టెలికామ్, బ్యాంకింగ్, వాహన, మౌలిక సదుపాయాల రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

### రిలయన్స్ ఇండస్ట్రీస్

నిరంతర వృద్ధి ఈ కంపెనీ జీవన విధానం. చమురు అన్వేషణ, రిఫైనింగ్, పెట్రో కెమికల్స్, పాలిస్టర్ యార్న్, గార్మెంట్స్ రంగాల్లో వ్యాపార కార్యకలాపాలు గల ఇటువంటి సమీకృత కంపెనీ ప్రపంచంలోనే లేదు. పైగా ఇప్పుడు రిటైల్, సెజ్‌లలోకీ విస్తరించింది. రెండో అతిపెద్ద రిఫైనరీని నిర్మించడం, కేజీ బేసిన్ నుంచి సహజవాయువును వెలికి తీయడం ద్వారా మలిదశ వృద్ధి దిశగా ఈ కంపెనీ అడుగులేస్తోంది. అమెరికా దిగ్గజాలైన ఎగ్జాన్ మొబిల్, వాల్‌మార్ట్ తరహాలో రూపుదిద్దుకుంటోంది. ప్రపంచంలోని పది అత్యంత విలువైన కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ త్వరలో స్థానం సంపాదించుకోబోతోంది.

### ఇన్ఫోసిస్

ఇన్ఫోసిస్ వంటి కంపెనీ శతాబ్దానికి ఒకటి పుడుతుంది! విశ్లేషకుల మానసపుత్రిక, వినియోగదార్ల ఎంపిక కావడం ఈ కంపెనీ ప్రత్యేకత. ప్రపంచంలోని అత్యంత గౌరవనీయమైన సంస్థల్లో ఇదొకటి. 1982లో ఆరుగురు భాగస్వాములు రూ.10,000 పెట్టుబడితో ప్రారంభించిన ఈ కంపెనీ రూ.1,00,000 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ స్థాయికి ఎదగడం సామాన్యమైన విజయం కాదు.

### భారతీ ఎయిర్‌టెల్

18 ఏళ్ల యువకుడిగా ఉన్నప్పుడు సునీల్ మిట్టల్ తండ్రి నుంచి రూ. 20,000 తీసుకొని వ్యాపార రంగంలోకి ప్రవేశించాడు. అక్కడ కట్ చేస్తే... మరో 30 ఏళ్లకు ఒక అతిపెద్ద టెలికామ్ కంపెనీ యజమాని అయ్యాడు. ఆ కంపెనీయే భారతీ ఎయిర్‌టెల్. ప్రపంచంలోని వంద అతిపెద్ద టెక్నాలజీ కంపెనీల్లో ఇదొకటి. ప్రతి సెకనుకో వినియోగదారుడిని సంపాదించడం దీని ప్రత్యేకత.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లోకి ప్రవేశిస్తే ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. అటు పూర్తిగా సంప్రదాయ బ్యాంకుగా కాకుండా, ఇటు దూకుడుగా కాకుండా మధ్యేమార్గాన్ని అనుసరించి అగ్రశ్రేణి బ్యాంకుగా ఎదిగిన ఘనత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సొంతం. 30 శాతం వార్షిక వృద్ధితో స్థిరంగా ఎదుగుతూ ఉండటం మరో ప్రత్యేకత. హెచ్‌డీఎఫ్‌సీతో విలీనం చేసిన పక్షంలో ఆర్థిక సేవల సూపర్ మార్కెట్‌గా, ఆకాశమే హద్దుగా ఎదిగే అవకాశం దీనికి ఉంది. సెల్‌ఫోన్, లాప్‌టాప్ ఉపయోగించని ఆదిత్యపురి దీనికి మేనేజింగ్ డైరెక్టర్!

### హీరో హోండా

నింపు.. మూసేయి.. మర్చిపో.. (ఫిల్ ఇట్, షట్ ఇట్, ఫర్‌గెట్ ఇట్)... ఈ మాటలు వినగానే మీ మదిలో ఒక మోటార్‌సైకిల్ మెదిలి ఉంటుందే. అదే హీరో హోండా. మోటార్‌సైకిళ్ల రంగంలో ప్రపంచ నెంబర్ వన్ స్థానాన్ని ఎన్నో ఏళ్లుగా నిలబెట్టుకుంటూ వస్తోంది కంపెనీ. దేశీయ మార్కెట్‌లో 55 శాతం మార్కెట్ వాటా దీని సొంతం. ప్రతి ఆరు సెకన్లకో మోటార్ సైకిల్‌ను తయారు చేయడం ప్రత్యేకత. పొరపాట్లకు తావులేని, అత్యంత సమర్థమంతమైన యాజమాన్యం ఉన్న, వాటాదార్లకు క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లించే ఈ కంపెనీ వాటాదారు కావడం ఎవరికైనా గొప్ప గౌరవమే.

### ఎల్ అండ్ టీ

ఇద్దరు స్వీడిష్ ఇంజనీర్లు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్వహించడానికి 1950లో మనదేశంలో నెలకొల్పిన కంపెనీ ఇది. ఒకే యజమాని లేని అత్యంత సమర్థమంతమైన మేనేజ్‌మెంట్ ఉన్న ఎల్ అండ్ టీకి రూ.70,000 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. ఎక్కడ ఎటువంటి భారీ నిర్మాణాలు కనిపించినా అక్కడ ఎల్ అండ్ టీ పేరు వినిపిస్తూనే ఉంటుంది. తనకు అంతగా ప్రాధాన్యం లేని రంగాల నుంచి వైదొలగుతూ, విదేశాలకు సైతం విస్తరిస్తున్న ఈ కంపెనీని మదుపుదార్లు తప్పక పరిశీలించాలి.

పైన పేర్కొన్న కంపెనీలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. తరచి చూస్తే ఇటువంటివే మరికొన్ని, ఇటువంటి కంపెనీలుగా ఎదిగే సామర్థ్యం ఉన్న ఇంకొన్ని కంపెనీలు కనిపిస్తాయి. ప్రపంచ శ్రేణి కంపెనీలుగా ఎదిగే సత్తా, సామర్థ్యం కల భారతీయ కంపెనీలెన్నో ఉన్నాయనే విషయాన్ని విస్మరించరాదు. ఇటువంటి ప్రతిష్ఠాత్మక కంపెనీల వాటాదారుగా మారి గుండెల మీద చేయివేసుకొని నిద్రపోవచ్చు.

(వ్యాస రచయిత హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్)